పాతాళానికి పడిపోయిన గంగ

- బోర్లలో తగ్గిన భూగర్భ జలాలు
- అరటి రైతుల ఆందోళన
- కొత్త బోర్లు వేస్తున్నా పడని నీరు


నీరు పడక నిరుపయోగంగా మారిన బోరు


కోతకు వచ్చిన అరటి పంట

కొలిమిగుండ్ల: వేసవి ప్రారంభంగాక ముందే భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. దీంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి పంటలు సాగు చేసిన రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో ఇప్పుడు ఈ పరిస్థితి నెలకొంది. భారీ వర్షం నమోదుగాక పోగా వాగులు, వంకల్లో నీరు లేక భూగర్భ జలాలు పూర్తిగా తగ్గిపోయాయి. కొలిమిగుండ్ల మండలంలోని మదనంతపురంలో అధిక శాతం మంది ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడ్డారు. అరటి, బొప్పాయి, దానిమ్మ, టమాట తదితర పంటలను సుమారు 400 ఎకరాల్లో సాగు చేస్తుంటారు. పంటలన్నీ బోర్ల కింద పండిస్తున్నారు. లక్షలు వెచ్చించి ఎక్కువ మంది రైతులు అరటి పండించారు. దిగుబడులు నెల రోజుల్లో చేతి వస్తాయి. ఇలాంటి సమయంలో అకస్మాత్తుగా బోర్లలో నీళ్లు అడుగంటిపోయాయి. మరికొని పూర్తిగా ఎండిపోయాయి. పంట చేతికొచ్చే సమయంలో బోర్లలో నీళ్లు అడుగంటిపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు దిగాలు పడుతున్నారు. గ్రామంలో 90 శాతం రైతుల బోర్లలో ఇదే పరిస్థితి నెలకొంది. వేసవి ఆరంభంలోనే ఇలా ఉంటే ఇంకా రాబోయే రోజుల్లో తీవ్ర పరిస్థితులు ఏర్పడే ప్రమాదముందని వాపోయారు. చివరకు పంటలకు పెట్టిన పెట్టుబడులు దక్కితే చాలనుకుంటున్నారు.

భగీరథ ప్రయత్నం

దాదాపు ఇరవై రోజుల నుంచి ఉన్నట్లుండి బోర్లలో నీటి మట్టం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో ఎలాగైనా చేతికొచ్చిన పంటలను కాపాడుకునేందుకు రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. అరటి సాగు చేసిన రైతులు ఇప్పటికే బోర్ల మీద బోర్లు వేస్తున్నారు. అయినా పాతాళం నుంచి గంగమ్మ ఉబికి రావడం లేదు. కనీసం నీటి తేమ కూడా కనిపించకుండా పోతోంది. కొత్త బోర్లు వేస్తే నీళ్లు పడి తద్వారా పంటలను కాపాడుకోవచ్చనే ఆశలు అడియాసలయ్యాయి. తోటి రైతుల బోర్ల నుంచి నీళ్లు పారించుకోవాలన్నా వారి పరిస్థితి అలాగే ఉంది. దీంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. పాత బోర్లలో నీరు లేక పోవడంతో మోటర్లను బయటకు వెలికి తీసుకుంటున్నారు. కొంత మంది రైతులు పంటలు ఎండుముఖం పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

వారంలో నాలుగు బోర్లు వేశాను



నేను నాలుగు ఎకరాల్లో అరటి సాగు చేశాను. గత సంవత్సరం అనుకున్నంతగా వర్షాలు కురవకపోవడంతో బోరులో నీరు తగ్గిపోయాయి. ప్రస్తుతం అరటి పంట చేతికొచ్చే సమయం ఆసన్నమైంది. వారంలో నాలుగు చోట్ల బోర్లు వేశాను. అయినా ఫలితం లేదు. అన్నింటికీ మోటర్లు అమర్చి చూస్తే చుక్క నీరు బయటకు రాలేదు. పంట పెట్టుబడితో పాటు బోర్లకు రూ.15 లక్షలు ఖర్చు చేశా. – **కంబగిరిరాముడు, రైతు**

నెల రోజుల్లో కోత కోయాలి



ఐదు ఎకరాల్లో అరటి పండించాను. నెల రోజుల్లో అరటి గెలలు కోత కోయాల్సి ఉంది. ఈ సమయంలోనే పంటకు నీళ్లు చాలా ముఖ్యం. కీలకమైన సమయంలో బోరు ఎండిపోయింది. కొత్తగా మూడు బోర్లు వేయించినా నీళ్లు పడలేదు. తోటలో వేసిన ఒక బోరులో చివరకు తేమ కూడా పడలేదు. అందుకే కేసింగ్ పైపు కూడా ఏర్పాటు చేయలేదు. నీళ్లు పడకపోవడంతో బోరును పూడ్చాల్సి వస్తోంది. – **వెంకట్రాముడు, రైతు**

17 నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

కొలిమిగుండ్ల: కోర్నపల్లె సమీపంలోని పురాతన గుండం ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన దక్షిణామూర్తి మహాగణపతి, నవనాగేంద్ర విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలను ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. వేదపండితుల బృందం మూడు రోజుల ప్రత్యేక పూజల అనంతరం 19న విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే సహించం

డోన్ టౌన్: ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహిస్తే సహించేది లేదని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు, సీఐ వరలక్ష్మీ హెచ్చరించారు. బుధవారం స్థానిక స్టేషన్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో కొందరు బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే ఆ గ్రామానికి వెళ్లి విచారణ జరిగి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బెల్టు షాపుల నిర్వాహణ కోసం కొందరు వ్యక్తులు రూ.25 వేలు వసూలు చేసినట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అటువంటిది తమ దృష్టికి రాలేదని, పట్టుబడితే దండన తప్పదన్నారు. బెల్టు షాపులు నిర్వహించినా, నాటు సారా తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం


అమ్మవారి శాలలో వ్రతంలో పాల్గొన్న దంపతులు

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారి శాలలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో మాఘమాసం పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం బుధవారం నిర్వహించారు. ఆలయ అర్చకులు పవన్‌కుమార్ శర్మ వేద మంత్రాలు చదువుతుండగా సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని, కలశాన్ని కొలువుంచుకొని భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

అంతా చెత్తమయం


రెడ్డిపల్లె ప్రధాన రహదారి పక్కన చెత్త కుప్పలు

సంజామల: గ్రామాలు అంతా చెత్తమయంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యంతో పారిశుద్ధ్య పనుల అటకెక్కాయి. మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అంతే కాకుండా చెత్త కుప్పలకు నిప్పు పెట్టడంతో దుర్గంధంతో పాటు పొగతో స్థానికులు, వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ


పరీక్ష ప్యాడ్‌లను చూపుతున్న విద్యార్థులు

డోన్ టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి గృహం విద్యార్థినులకు వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఎగ్జామ్స్ ప్యాడ్స్, పెన్నులను అందించారు. సంస్థ సభ్యులు దళవాయి కుల్లాయప్ప పుట్టిన రోజును పురస్కరించుకొని బుధవారం వీటిని అందజేశారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థుల నడుమ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించుకున్నారు. సంస్థ వ్యవస్థాపకులు జగన్‌మోహన్, అధ్యక్ష కార్యదర్శులు నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు, సభ్యులు రంగయ్య, హాస్టల్ వార్డెన్ కరుణ, అధ్యాపకుడు చంద్రమోహన్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సారా బెల్లం స్వాధీనం


అధికారులు స్వాధీనం చేసుకున్న సారాబెల్లం సంచులు

డోన్: ప్యాపిలి మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో 45 సంచుల సారా బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నంద్యాల జిల్లా ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిటెండెంట్ రాముడు తెలిపారు. కలచట్ల గ్రామానికి చెందిన మహేశ్ ద్వారా బెల్లం సంచులు కొనుగోలు చేసినట్లు నిందితుడు తెలిపాడన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. దాడుల్లో సీఐ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై దాడులను అరికట్టాలి

బేతంచెర్ల: దివ్యాంగులపై దాడి చేసిన వారిపై పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్ఫూర్తి దివ్యాంగుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి, రాముడు కోరారు. బుధవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ డీ.వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో దివ్యాంగుల చట్టం – 2016 గురించి తెలిపే పోస్టర్లను విడుదల చేశారు.

అడవుల సంరక్షణపై అవగాహన


సీతారామాపురంలో అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

బేతంచెర్ల: అడవులను అగ్ని బారి నుంచి కాపాడటం, వన్యప్రాణులను రక్షించడంతో పాటు పలు అంశాలపై పాణ్యం రేంజ్ అటవీ అధికారులు అవగాహన కల్పించారు. బుధవారం మండల పరిధిలోని సీతారామాపురం, ముద్దవరం గ్రామాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. అనంతరం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ అనీల్‌కుమార్ మాట్లాడుతూ.. అడవులలో చెట్లను నరకరాదన్నారు. చెట్లను పెంచడంతో పాటు అడవి జంతువులను కాపాడుకోవాలన్నారు. అడవులను అన్యాక్రాంతం, అక్రమణలు చేయరాదన్నారు. బీట్ ఆఫీసర్ రఘురాముడు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల వేతనాలు పెంచాలి


బనగానపల్లెలో సీడీపీఓకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ నాయకురాళ్లు

బనగానపల్లె రూరల్: రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ సెంటర్లలో పని చేస్తున్న వర్కర్లకు వేతనాలు పెంచాలని సీఐటీయూ బనగానపల్లె డివిజన్ కార్యదర్శి సుబ్బయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ ఉమామహేశ్వరమ్మకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయు డివిజన్ కార్యదర్శి సుబ్బయ్య మాట్లాడుతూ.. అంగన్‌వాడీ వర్కర్లకు 2019 నుంచి వేతనాలు పెంచలేదని, దీంతో వారు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు చేయాలని, ప్రీస్కూల్ బలోపేతం చేయాలని, ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని, ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం సీడీపీఓకు అందజేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు మల్లీశ్వరి, వెంకటలక్ష్మి, వరలక్ష్మీ, చంద్రకళ, రామేశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి

డోన్ టౌన్: రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జరిగిన హెచ్‌డీఎస్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని వసతులు, వైద్య విభాగాలు, డాక్టర్ల సంఖ్య, అందుబాటులో ఉన్న పరికరాలు తదితర వాటిపై ఆరా తీస్తూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూతనంగా నిర్మించిన వంద పడకల ఆసుపత్రిలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందించడానికి అవసరమైన ఏర్పాటు చేసి, ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్‌రఫీ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: అదనపు కట్నం కోసం భర్త, అత్త, మామ వేధింపులకు గురి చేస్తున్నారని కోడలు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. వివరాలు.. పట్టణంలోని కొత్తపేట కాలనీకి చెందిన కుమ్మరి గాయత్రిని 3 సంవత్సరాల క్రితం ఎమ్మిగనూరుకు చెందిన నాగేంద్ర, నాగమణి దంపతుల కుమారుడు హరి ప్రసాద్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఏడాది కాలంగా అదనపు కట్నం కోసం భర్త, అత్త, మామ వేధింపులకు గురి చేస్తున్నట్లు కోడలు కుమ్మరి గాయత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు.

కంది దిగుబడికి నిప్పు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని వెంకటనాయునిపల్లెలో రైతు చెన్నయ్యకు సంబంధించిన కంది పంట దిగుబడి అగ్నికి ఆహుతైంది. రైతుకు సొంతమైన 12 ఎకరాల పొలంలో కంది పంట సాగు చేశారు. పంటను కోత కోసి నూర్పిడి కోసం ఒకచోట ఉంచగా బుధవారం రాత్రి మంటలు వ్యాపించి పూర్తిగా అగ్నికి ఆహుతైంది. మంటలు చెలరేగడం గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు. కంది దిగుబడికి ప్రత్యర్థి వర్గం వారు నిప్పు పెట్టి ఉంటారని బాధిత రైతు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులపై ఎస్ఐ రమణయ్య బుధవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన వ్యక్తులు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీస్ సిబ్బందితో దాడి చేసి వారి దగ్గర నుంచి రూ.2700 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ధుని ఊరేగింపు

డోన్ టౌన్: పట్టణంలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని పవిత్ర ధుని ప్రజ్వలన కోసం బుధవారం స్థానిక శ్రీరామచంద్ర మాలిక్‌బాబా సంస్థాన్ నుంచి భక్తి శ్రద్ధలతో అగ్నిని తీసుకెళ్లి ధుని స్థాపన కార్యక్రమాలు చేపట్టారు. మాలిక్‌బాబా సంస్థన్ సభ్యులు, భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి భాజా భజంత్రీలతో అంగరంగ గ్రామోత్సవం నిర్వహించారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

బేతంచెర్ల: మీ తల్లిదండ్రుల ఆకాంక్ష మేరకు విద్యార్థులు ఇష్టంతో చదవాలని సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్‌బాబు సూచించారు. బుధవారం పట్టణ సమీపంలోని కేజీబీవీ గురుకుల విద్యాలయంను సీఐ, ఎస్ఐ సందర్శించారు. గురుకుల విద్యాలయ ఆవరణాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు పరీక్షలకు భయపడకుండా ప్రణాళిక ప్రకారం చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

బడ్జెట్‌లో దివ్యాంగులకు ప్రాధాన్యతివ్వాలి

కోవెలకుంట్ల: ఈ నెలలో ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్‌లో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని దివ్యాంగ సంఘం జిల్లా జేఏసీ అధ్యక్షుడు అందనం దేవ రాజు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.6 వేల కోట్లు ప్రవేశ పెట్టాలన్నారు. దివ్యాంగులకు పెన్షన్ తప్ప ఏ సమస్య తీరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నరసరావుపేటలో దివ్యాంగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అర్హత ఆధారంగా దివ్యాంగులకు రూ.10 లక్షల వరకు ఉచిత రుణాలు ఇవ్వాలని, ఇంటి స్థలంతోపాటు పక్కాగృహాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

కోవెలకుంట్ల: 2024–25 ఆర్థిక సంవత్సరానికి బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసేందుకు దరఖాస్తు గడువు పొడగించినట్లు ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి పథకాల ద్వారా జీవనోపాధి కల్పించేందుకు సబ్సిడీ రుణాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీ–ఏకు 23, బీసీ–బీకి 14, బీసీ–డీకి ఏడు, బీసీ–ఈకి 11 యూనిట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీసీ కులాలకు చెందిన వ్యక్తులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

బనగానపల్లె రూరల్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచితంగా నిర్వహించే డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ టెక్నీషియన్ కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత బుధవారం తెలిపారు. పదో తరగతి ఆపై చదివి, 18–26 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి మూడు నెలల పాటు ఆయా కోర్సుల్లో ఉచిత శిక్షణ ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 97059 98056, 96886 51650 ఫోన్ నంబర్లను సంప్రదిచాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(హాస్పిటల్): దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్‌రెడ్డికి ఫీల్డ్ సిబ్బంది బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 17 సంవత్సరాలుగా తాము ఫీల్డ్‌లో పనిచేస్తున్నామని, కనీస వేతనాల కోసం రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికే కొందరు రిటైర్ కాగా, మరికొందరు రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం 15 రోజుల పాటు సానుకూల పద్ధతుల్లో వివిధ రకాలుగా ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. స్పష్టమైన హామీ లభించని పక్షంలో విధులు బహిష్కరిస్తామని స్పష్టం చేశారు.

పుట్ట పెద్దమ్మకు బోనాలు


పుట్ట పెద్దమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు


బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు మహిళలు

బేతంచెర్ల: పట్టణం నుంచి బనగానపల్లె వెళ్లే రహదారిలో వెలసిన, భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్న పుట్ట పెద్దమ్మ బోనాల జాతర మాఘ శుద్ధ పౌర్ణమి బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారి విగ్రహాన్ని రథంపై కొలువుంచి డప్పు వాయిద్యాలు, చిన్నారుల కోలాటం మధ్య బోనాలతో ఊరేగింపుగా పాత కూరగాయల మార్కెట్ నుంచి బోయపేట, కొత్త బస్టాండు, పాతబస్టాండు, హనుమాన్ నగర్, సంజీవనగర్ కాలనీల మీదుగా అమ్మవారి ఆలయం చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పుట్ట పెద్దమ్మ నమోస్తుతే.. చల్లని తల్లి అనుగ్రహించూ అంటూ మొక్కుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, సత్యం, రవి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం

ఘనంగా పౌర్ణమి పూజలు


చౌడేశ్వరి దేవికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం


లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో కొలువైన చౌడేశ్వరి దేవికి అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి, పల్లకీ సేవ, ఉయ్యాల సేవ, సహస్ర దీపాలంకరణ సేవ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం


కాశీ విశాలక్షి, విశ్వేశ్వర స్వామికి కల్యాణం నిర్వహిస్తున్న గ్రామస్తులు


బండలాగుడు పోటీల్లో రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమాన్‌పురం గ్రామంలో వెలసిన కాశీ విశాలక్షి, విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం కమనీయంగా నిర్వహించారు. మాఘ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకొని స్వామి అమ్మవార్లకు ఉదయం ప్రాతఃకాల పూజలు, రుద్రాభిషేకం, మహామంగళహారతి, పూర్ణాహుతి ప్రత్యేక పూజల అనంతరం కల్యాణోత్సవం కనులపండువగా జరిపారు. సాయంత్రం మేలతాళాలతో స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు.
ఉత్సవాల సందర్భంగా గ్రామ రైతు సంఘం, దాతల సహకారంతో జిల్లాస్థాయి 4 పండ్లలోపు వృషభ రాజములకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హాజరై పోటీలను ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో కోడుమూరు మండలం శశాంక్ వృషభాలు ప్రథమ, బేతంచెర్ల మండలం, భానుజ వృషభాలు ద్వితీయ, దొర్నిపాడు మండలం, మనోహర్ యాదవ్, వైఎస్సార్ జిల్లా దీప రాజునాయుడు వృషభాలు సంయుక్తంగా తృతీయ, నంద్యాల జిల్లా, కొత్తపల్లి మండలం ప్రసాద్, వైఎస్సార్ జిల్లా ప్రతాప్‌యాదవ్ వృషభాలు సంయుక్తంగా నాల్గవ, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి వృషభాలు 5వ, నంద్యాల జిల్లా శిరివెల్ల మండలం సిద్ధయ్య వృషబాలు 6వ స్థానం కైవసం చేసుకోగా దాతల సహకారంతో వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల నగదు బహుమతులు అందజేశారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


డిప్యూటీ తహసీల్దార్ సునీల్‌రాజాకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని పేరంటమ్మ గుడి వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో తమకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఆదుకోవాలని స్థానిక కేఈ కృష్ణమూర్తి నగర్ కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం కాలనీకి చెందిన మాధవస్వామి ఆధ్వర్యంలో నిరుపేదలు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీటీ సునీల్‌రాజాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొద్ది సంవత్సరాలుగా పట్టణ సమీపంలోని పాత ఆర్ అండ్ బీ రహదారిలో రోడ్ల పక్కన గుడిసెల్లో నివశిస్తున్నామని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేసారు. వినతి పత్రం అందించిన వారిలో కాలనీకి చెందిన లక్ష్మీదేవి, నాగేశ్వరరావు, రిక్షా రంగన్న, మద్దిలేటి, బాలరాజు, మధు తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న పీడీ వెంకటసుబ్బయ్య

బనగానపల్లె రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని జిల్లా ఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య ఆదేశించారు. ఆయన బుధవారం మండలంలోని టంగుటూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీని కలిసిన పలువురు రైతులు.. ప్రస్తుతం వ్యవసాయ పనులు ఎక్కువగా ఉండటంతో వాటికి వచ్చే కూలీల సంఖ్య తక్కువగా ఉందని, ఎక్కువ మొత్తం ఇచ్చి కూలీలను పిలుచుకుంటున్నట్లు చెప్పారు. తద్వారా రైతులకు ఆర్థిక భారం పడుతోందని, కొద్ది రోజులు ఉపాధి పనులు నిలిపివేయాలని పీడీని కోరారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బీవీ రమణ ఆధ్వర్యంలో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఏఏ గ్రామాల్లో ఎంత మంది కూలీలు పనులకు వస్తున్నారు. వారికి ఇచ్చిన టార్గెట్ తదితర వివరాలను టీఏలో రివ్యూ చేశారు. ఏపీఎం రేష్మా, ఈసీ మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించండి


మాట్లాడుతున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల: రెవెన్యూ సంబంధిత సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరిగతిన పరిష్కారం చూపాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆయన బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులు, ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో పట్టాదారు పాస్‌పుస్తకాలు, భూసమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా అమలు చేయాలని, విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ పుల్లయ్య, మండల సర్వేయర్ వీరన్న, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.